# మార్పు

సాయంత్రం ఆరు దాటిందో లేదో ఆకాశంలో నిండు చందమామ ప్రత్యక్షమయ్యాడు. చంద్రోదయపు ఆనందాన్ని పంచుకోవటానికి ఇంట్లో ఎవరూ లేరు. అనసూయ అరగంట సేపు డాబా మీద నిలబడి చంద్రునితో మౌన సంభాషణ చేసింది. యాభై ఏళ్ళు దాటినా చంద్రుడి సమ్మోహనం నుంచి తప్పించుకోలేక పోవటం తన బలహీనతా, చంద్రుడి బలమా అని నవ్వుకుంటూ కిందికి వచ్చింది. హాల్లో ట్యూబులైట్లు ఆర్పేసి కిటికీ తెరలు పక్కకు జరిపి వెన్నెల ఇంట్లో పడేందుకు కావలసిన సన్నాహాలు చేసింది.

మనసు ఉల్లాసంగా ఉంది. పంచుకునేందుకు కేశూ ఉంటే బాగుండేదనిపించింది అనసూయకు. రిటైరయ్యాక కూడా ఏదో ఒక పని కల్పించుకుని బయటికి పరిగెత్తటం నేర్చుకున్న కేశవరావు మీద కోపం తెచ్చుకుంది.

అరవింద్ ఇంకా రాలేదు. బ్యాంక్‌లో జరిగే కంప్యూటరీకరణకు ఆరు నెలలుగా అతని సాయంత్రాలు ఆహుతైపోతున్నాయి. కంప్యూటర్ల వల్ల ఏ మార్పు వచ్చినా, రాకపోయినా వాటితో పని చేసేవాళ్ళకు సాయంత్రాలు మిగలటం లేదనీ, చంద్రుడినీ, వెన్నెలనూ, నక్షత్రాల రాత్రులనూ కోల్పోతున్నారనీ అనసూయ బాధపడుతుంది.

'అంత భావుకత్వం ఉన్నవాళ్ళు కంప్యూటర్ ఇంజనీర్లవరులే. ఈ రోజుల్లో వెన్నెలెవరిక్కావాలి? వేలల్లో జీతాలు కావాలి గానీ' అంటాడు కేశవరావు.

కోడలు అచల ఊళ్ళో లేదు. నెలకు పదిహేను రోజులు ఆ అమ్మాయి ప్రయాణాల్లో ఉంటుంది. దక్షిణాసియా దేశాలలో జరిగే మహిళా అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ఏర్పడిన సంస్థలో పని చేస్తోంది అచల. ఆరు నెలల క్రితం ఆ సంస్థలో అంత బాధ్యత గల ఉద్యోగం దొరికినందుకు అందరూ పొంగిపోయారు. కానీ, బాధ్యతతో పాటు పనీ, ప్రయాణాలు కూడా ఎక్కువే. దాదాపు భారతదేశమంతా తిరగాలి. ట్రైనింగ్ ఇవ్వటానికో, తీసుకోవటానికో ఇతర దేశాలూ వెళ్ళాలి. మరో మూడేళ్ళ పాటు ఈ ఉద్యోగం చేసి ఆ తర్వాత పిల్లల్ని కనాలని అచల ఆలోచన.

ఇల్లంతా ఒంటరిగా కలయదిరుగుతున్న అనసూయ అరవింద్ గదిలోకి వచ్చింది. అచల వెళ్ళి వారం రోజులయింది. వారం రోజుల నుంచీ అరవింద్ ఆ గది సర్దలేదు. పేపర్లూ, పుస్తకాలూ చిందరవందరగా పడి ఉన్నాయి. కప్పుకున్న దుప్పటి కూడా మడతపెట్టని కొడుకు బద్ధకాన్ని తిట్టుకుంటూ గది సర్దటానికి పూనుకుంది. రాత్రి పది గంటల విమానంలో వచ్చే కోడల్ని తల్చుకుంటే మరింత ఉత్సాహం వచ్చింది. పక్క దుప్పటి మార్చింది. కిటికీ కర్టెన్‌లు మార్చింది. కిటికీ మీదుగా పైకి పాకిన జాజి తీగ నుంచి ఒపిగ్గా పూలుకోసి వాటిలో సగం పింగాణీ గిన్నెలో పోసి నీళ్ళు చిలకరించింది. గులాబీ రంగు దుప్పట్ల మీద వెన్నెల

పడి మెరుస్తోంది. బైటికి వెళ్ళి చూస్తే గులాబీలూ ఉన్నాయి. రెండు గులాబీలను రెమ్మలతో సహా కత్తిరించి చిన్న వాజ్‌లో అమర్చింది. గులాబీలూ, సన్నజాజులూ స్నేహంగా నవ్వుకున్నాయి. ఒకరి గొప్పలు ఒకరు చెప్పుకోవటానికి సిద్ధమయ్యాయి.

టేబిల్ మీద టీ మరక లాంటిది కనిపిస్తే తడి బట్టతో తుడిచి వెనక్కు తిరగబోతున్న అనసూయకు పక్కనే ఓ పుస్తకం మీద 'అమ్మకు' అని రాసిన అక్షరాలు కనబడి ఆశ్చర్యపోయింది. అరవింద్ అక్షరాలవి. ఆ పుస్తకం తీసుకుంది. డైరీ-కానీ, అందులో అరవింద్ దినచర్యేమీ లేదు. పుస్తకమంతా ఖాళీ- మధ్యలో నాలుగైదు కాగితాలు. అవి తీసి చూస్తే ఉత్తరం. అనసూయకే. అనసూయ ఆశ్చర్యంతో, సందేహంతో చదువుతోంది.

అమ్మా,

నీతో ఎలా మాట్లాడాలో, నా బాధ నీకు ఎలా అర్థం చేయించాలో తెలియక ఈ ఉత్తరం రాస్తున్నాను. నా పెళ్ళయి రెండేళ్ళు. అచలకు ఉద్యోగం రాక ముందు మాకే సమస్యలూ లేవు. కానీ, అచల ఉద్యోగం వల్ల మారిందో, అసలు తన స్వభావమే అంతేనో నాకు తెలియటం లేదు. తనకు మగ స్నేహితులు ఎక్కువ. కలిసి ప్రయాణాలు చేయటమే కాదు, కలిసి ఒకే గెస్ట్‌హౌస్‌లో, ఒకే గదిలో కూడా ఉంటుంది. ఈ విషయం దాచాలని కూడా అనుకోదు.

పోయినసారి బ్యాంకాక్ వెళ్ళినప్పుడు జరిగిన సంగతులు వింటుంటే నా గుండె మండిపోయింది. అక్కడ విక్టర్ అనే అతనితో కలిసి తానెంత ఎంజాయ్ చేసిందో చెబుతుంటే నేను భరించలేకపోయాను. ఇద్దరూ కలిసి షికార్లు, సంగీతాలకూ, నాట్యాలకూ కలిసి వెళ్ళటం, పడవ ప్రయాణాలు, ఆఖరికి ఒక మసాజ్ పార్లర్‌కు కూడా వెళ్ళింది.

బంగ్లాదేశ్‌లో రఫీ అనేవాడు పరిచయమై మంచి స్నేహితుడయ్యాడంటూ అతని వేణుగానాన్ని పద్మానది ఒడ్డున వెన్నెల రాత్రి విని పరవశించానంటుంది.

నాకు అచల మీద అసహనం, కోపం పెరిగిపోతున్నాయి. మేము ఘర్షణ పడుతూనే ఉన్నాం. అమ్మా, నేను సంకుచితంగా ఆలోచిస్తున్నానని నువ్వనుకోవచ్చు కానీ, నేను సర్దుకోలేకపోతున్నాను. అచల ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంట్లోనైనా ఉండాలి లేదా నాతో విడిపోయి ఉద్యోగమైనా చేసుకోవాలి. మరో మార్గం లేదు. నేనిక ఈ హింస భరించలేను.

-నీ విందూ

ఉత్తరం చదువుతూనే అనసూయ ముఖం పాలిపోయింది. ఒళ్ళంతా నీరసం కమ్మినట్లయింది. ఇంతవరకూ హాయినిచ్చిన వెన్నెల ఇప్పుడు ఎగతాళిగా నవ్వుతోంది. ఆ ఉత్తరం తీసుకుని ఆ గది నుంచి మెల్లగా బైటికి నడిచింది.

కొడుకు మీద జాలి, కోడలి మీద ప్రేమ.

ఎవరికి ఏం చెప్పాలి? ఏం చెప్పకూడదు? ఎలా చెప్పాలి?

ఒక్క క్షణం అంతా అయోమయంగా, గందరగోళంగా అనిపించింది.

అరవింద్ సరే, అచల తనతో ఇలాంటి గొడవ తమ మధ్యన జరుగుతున్నట్లు చూఛాయగా కూడా అనలేదు. తానూ గమనించలేదు. తమ మధ్య ఏం జరగనట్లు మామూలుగా ఉండటానికెంత కష్టపడిందో పిచ్చిపిల్ల.

కాలింగ్ బెల్ మోగటంతో వెళ్ళి తలుపు తీసింది.

అరవింద్. ఇవాళ అతని ముఖం అపరిచితుడి ముఖంలా కొత్తగా కనిపిస్తోంది.

అమ్మ ఈ రోజైనా ఉత్తరం చూసిందా లేదా అన్నట్లు చూస్తున్నాడు తన కళ్ళల్లోకి. ఆ కళ్ళ లోపల తనకు తెలియని అగాధాలు ఎన్ని ఉన్నాయో!

రోజులా ఏదో ఒక మాటతో పలకరించకుండా తన కళ్ళల్లోకి చూస్తున్న తల్లిని చూసి అరవింద్‌కు అనుమానం వచ్చింది.

గబగబా తన గదిలోకి వెళ్ళి వెంటనే బైటకొచ్చాడు.

"అమ్మా, అచల వచ్చిందా?" ఎదురుగా ఉన్న అనసూయను గావుకేక పెట్టి అడిగాడు.

"పదింటికి కదా తాను వచ్చేది." మెల్లగా అంది అనసూయ.

"గది సర్ది ఉంటేనూ" అంటూనే తన గదిలోకి వెళ్ళాడు.

ఉత్తరం ఉండాల్సిన చోట లేదు. ఒక్క క్షణం ఏదోగా అనిపించినా, సర్దుకుని బైటికి వచ్చాడు.

అనసూయ తన గదిలోకి వెళ్తూ "స్నానం చేసి అన్నం తినెయ్. నాన్న రావటానికి ఆలస్యమవుతుంది" అంది.

కేశవరావుతో మాట్లాడకుండా అరవింద్‌తో మాట్లాడటం ఆమెకిష్టం లేదు.

అరవింద్ అది గ్రహించినట్లు గబగబా అడుగులు వేసి తల్లికెదురుగా నిలబడ్డాడు.

"అమ్మా, మనం మాట్లాడుకోవాలి."

"వాళ్ళిద్దర్నీ కూడా రానీ."

"కాదు. ముందు మనిద్దరం మాట్లాడుకోవాలి."

"ఇదేమైనా చిన్నపిల్లల ఆటా? కొత్త బట్టలు కొనుక్కోవటమా? ప్యాకెట్ మనీ

పెంచుకోవటమా- మనమిద్దరమే మాట్లాడుకోటానికి? అయినా, ఏం మాట్లాడతావు? నువ్వేదో నిర్ణయానికి వచ్చినట్లున్నావుగా." కటువుగా అంది అనసూయ.

అరవింద్ తల వంచుకున్నాడు.

"అచల వచ్చాక నీ నిర్ణయం చెప్పు. ఆమె కదా ఆలోచించి చెప్పాల్సింది."

"అది కాదమ్మా! నేను భరించలేక పోతున్నాను."

కొడుకు గొంతులో దీనత్వం ఆమె భరించలేదు.

"నా బాధ నన్ను తినేస్తోంది." అరవింద్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నాకు తెలుసు. బాగా తెలుసు. ఒకప్పుడు నేనూ నీలాగే బాధపడ్డాను" అని చెప్పలేకపోయింది అనసూయ.

ఆమె కళ్ళల్లోనూ నీళ్ళు.

తల్లి కళ్ళల్లో నీళ్ళు చూసేసరికి అరవింద్‌కి కొత్త బలం వచ్చినట్లయింది.

"అమ్మా, నా నిర్ణయం మారదు. అచలకు నచ్చజెప్పు. అచలకు రాను రానూ..."

కొడుకు ముఖం కఠినమవుతుంటే అనసూయ చూడలేకపోయింది.

"నాన్నా, నేనూ కలిసి ఆలోచిస్తాంలే విందూ" అంది అదే ఆఖరి మాట అన్నట్టు.

అరవింద్ ఇంకేమీ అనలేకపోయాడు.

అనసూయ బలహీనంగా తన గదిలోకి చేరింది.

కొడుకు కోపం తన పాత జ్ఞాపకాలను పచ్చిగా చేసింది. పెళ్ళి కాకముందు, కేశవరావు ఆర్టిస్టు అని ఎంత సంబరపడిందో, అతని బొమ్మల్ని చూసి ఎంత ముచ్చట పడిందో, పెళ్ళయ్యాక అతని అభిమానులనూ, స్నేహితురాళ్ళనూ చూసి అంత దిగులు పడింది.

అతని చిత్రాలలో తమ ఆవేశాలనూ, అనుభూతులనూ వెతుక్కునే అతని స్నేహితురాళ్ళు, చాలాకాలం అనసూయకు అర్థమే కాలేదు. గంటలకు గంటలు అతని స్టూడియోలో గడిపే రోజీని చూస్తే తనకు కోపం, అసహ్యం.

ఆమె కళ్ళల్లో ఆరాధన చూస్తే తనకు ఒళ్ళంతా దహించుకుపోయేది.

ఒక రోజు రోజీ వచ్చింది. స్టూడియోలోకి వెళ్ళింది. కేశవరావు బొమ్మ వేస్తున్నాడు. రోజీ అతని వెనక నిశ్శబ్దంగా నిల్చుంది. ఆమె వచ్చినట్లు అతనికి తెలియనంత నిశ్శబ్దంగా.

తాను వెళ్ళింది. కర్టెన్ చాటుగా నిలబడింది. వాళ్ళిద్దరికీ తాను కనపడదు కానీ, తన గుండె చప్పుడు ఆ గదంతా వినపడేంత పెద్దగా ఉంది.

గుండెల మీద చెయ్యేసి వెనక్కు నొక్కుకుంది.

ఇప్పుడేం జరుగుతుంది? రోజీ ఏమంటుంది? వాళ్ళిద్దరూ ఏం చేస్తారు? చెవుల్లో హోరు. రక్తం తలకెక్కే చప్పుడు.

కేశవరావు రోజీని ముద్దు పెట్టుకుంటాడా? కౌగలించుకుంటాడా?

కళ్ళు తిరిగిపోతున్నాయి. కర్టెన్‌ని ఒక చేత్తో గట్టిగా పట్టుకుంది.

నిమిషాలు నడిచాయి. గంటలు గడిచాయి. కేశవరావు పని ఆపలేదు. రోజీ కదలలేదు.

తనకు నీరసం. నిస్త్రాణ.

చివరికెప్పుడో మూడున్నర గంటల తర్వాత రోజీ ఇటు తిరిగింది. రోజీ చెంపల మీద కన్నీటి చారికలు. పమిట తడిసిన గుర్తులు. మెల్లగా ఆమె బైటికి వెళ్ళి పోయింది. తనకేమీ అర్థం కాలేదు. ఏమిటీ వ్యవహారం. రోజీకి కన్నీళ్ళెందుకు? భగ్న ప్రేమా? కేశవరావుకి ఇష్టం లేదా?

తెర చాటు నుంచి వచ్చి కేశవరావు దగ్గరకు వెళ్ళింది.

"ఏంటి అనూ, ఏం కావాలి?" ఇటు తిరక్కుండానే అడిగాడు.

మూడున్నర గంటలు రోజీ నిల్చుంటే తెలియనట్లు బొమ్మలు వేస్తున్న మనిషి.

"ఇప్పటిదాకా రోజీ ఇక్కడే ఉంది."

"తెలుసు."

"మాట్లాడలేదేం?" తాను కర్టెన్ వెనక దాక్కున్న సంగతి తెలుసా అని భయపడింది.

"ఏముంది మాట్లాడటానికి? రోజీకి రంగులిలా విస్తరిస్తుంటే, మారుతుంటే చూడటం ఇష్టం. చూస్తూ ఉంటుంది. నవ్వుతుంది. నృత్యం చేస్తుంది. ఏడుస్తుంది. నేను పట్టించుకోను. పట్టించుకుంటే ఆమె ఆనందం భగ్నమైపోతుంది?"

తనకు అర్థం కాలేదు. అన్నీ మాయ మాటలు. తానున్నట్లు తెలుసు.

"నేను ఊరికే వచ్చాను. భోజనం చేద్దామా?"

కేశవరావు తన వెంట వచ్చేశాడు.

ఆ రోజు రాత్రి కేశవరావు రోజీ గురించి చెప్పాడు. ఆమె పెయింటర్ కాదు. కానీ, వర్ణ చిత్రాలంటే పిచ్చి. అవి ఆమెను సూటిగా తాకుతాయి. మిగిలిన వాళ్ళు చిత్రాలను చూసే తీరుకీ, రోజీ తీరుకీ ఎంతో తేడా. ఆ రంగులు ఆమెనేదో చేస్తాయి. రెచ్చగొడతాయి.

మీద పడతాయి. ఆమెకు పిచ్చెక్కిస్తాయి. ఆమె రక్తాన్ని ఉద్రేకపరుస్తాయి. ఆ ఉద్రేకానుభూతి కోసం ఆమె చిత్రకారుల దగ్గరకు వెళ్తుంది."

"తానే బొమ్మలు వెయ్యటం నేర్చుకోవచ్చుగా." అనసూయ ఇంకా నమ్మలేక పోతోంది.

"ప్రయత్నించింది. చాలా చిన్నతనంలోనే. రంగులు ఆమె వేళ్ళను కుదురుగా ఉండనివ్వవు. ఆమె ఏమీ గీయలేదు. తన మీద తనకే కోపం. వేళ్ళను కోసేసుకుంది పిచ్చిగా, లాభం లేదని తెలుసుకుంది. చిత్రాలు తన లోపల్నించి రావు. బైటి నుంచి తన లోపలికి పోతాయి. ఒక్కొక్కరి తత్త్వం అలా ఉంటుంది. వాళ్ళ నరాల మీద పనిచేస్తాయి కళలు సూటిగా. సంగీతానికి పిచ్చెత్తిపోయేవాళ్ళు తెలియదూ నీకు?"

తెలియదు. తనకు మామూలు మనుషులే తెలుసు.

రోజీ విషయం అర్థమయ్యాక కొంత బరువు దించుకున్నట్లయింది. కానీ, ఆయన స్నేహితులందరూ వింతగానే ప్రవర్తించేవారు.

రుక్మిణి, కేశవరావు వన్ మాన్ షో చూసివచ్చి, "అప్పుడపుడూ ఒక బొమ్మ చూస్తుంటే ఆ దారి వేరు. ఇవాళ మంచి విందు భోజనంలా ఉంది. ఎంత అద్భుతముంది ఈ వేళ్ళలో. వాటినో సారి ముట్టుకో నివ్వవూ" అంటూ కేశవరావు చేతుల్ని తీసుకుని కళ్ళకద్దుకుని చెంపలకానించుకుంది.

తనకు ఒళ్ళు మండిపోయింది. తనకూ కళాకారులు చాలామంది ఇష్టం. గాయకులూ, నటులూ ఎందరినో ఇష్టపడుతుంది. అయినంతమాత్రాన వాళ్ళు కనిపించగానే మీద పడిపోతోందా? వీళ్ళేమిటి ఇలా? అసలాయనలోనే ఉంది. ఇట్లాంటి వాళ్ళను దగ్గరకెందుకు రానివ్వాలి?

తన ఆలోచనల్లో పడి కేశవరావుని ఆలింగనం చేసుకుని అభినందిస్తున్న వేణు, రవిలను పట్టించుకోకపోతే, కేశవరావే పిల్చి పరిచయం చేశాడు. వాళ్ళకు నమస్కారం చేసి, వాళ్ళకు అడ్డంగా ఎందుకని పక్కకు నడిచి తన స్నేహితులతో మాట్లాడుతూ నిల్చుంది. ఆ రోజు రాత్రి కేశవరావు దగ్గర రుక్మిణిని విమర్శించకుండా ఉండలేకపోయింది.

కేశవరావు చాలా సేపు ఆలోచిస్తున్నట్లుండిపోయాడు.

"నీకు అసూయగా ఉందా" అన్నాడు చివరికి.

నాకు అసూయ ఏమిటి? ఆవిడెవరని? ఆవిడ మీద అసూయపడటం ఏమిటి? తన మనసులో ఉన్నది అసూయని ఒప్పుకోలేకపోయింది. నిజానికది పూర్తిగా అసూయ కూడా కాదు. బీజ రూపంలో ఉన్న అనుమానం. అసూయ దానికి తోడవటానికి చాలా

కాలం పడుతుంది.

"అవిడ మీద కాదు. పోనీ నా మీద."

"నీ మీదా? నీ మీద నాకెందుకూ అసూయ?"

"నాకంతమంది అభిమానులున్నారని."

"ఉంటే నాకు సంతోషమే. కానీ, ఇలా అతి చేసే వాళ్ళంటే-"

"ఏం అతి చేసింది రుక్మిణి?"

"అతి కాదా? ఇంకేం చెయ్యాలి? మీ చేతుల్ని పట్టుకుని చెంపలకానించుకున్నా చాల్లేదా? కావలించుకోవాలా?" కోపం వివేకాన్ని తినటంలోని ఆనందంలో పూర్తిగా నిమగ్నమైపోయింది.

"ఆ పని వేణు, రవి చేశారు చూడలేదా?"

"వాళ్ళు మగవాళ్ళు."

"మగవాళ్ళు నన్ను కావలించుకున్నా తప్పులేదు. కానీ, ఆడవాళ్ళు ముట్టుకుంటే కొంప మునుగుతుంది." నవ్వాడు కేశవరావు.

"కొంప మునగటం కాదు, అసలెందుకలా చెయ్యాలి?"

"చెయ్యకుండా ఉండలేక. మనసుకు చాలా నచ్చిన పువ్వునో, మరో దాన్నో తాకకుండా ఉంటారా మనషులు?"

"అదీ, ఇదీ ఒకటేనా?"

"కాక? ఏదైనా స్పర్శ- తాకటం- అదే గదా!"

"స్పర్శలో అర్థాలుండవా?" కోపంగా అడిగింది.

"అమ్మయ్య, తెలుసుగదా ఆ విషయం. స్పర్శలో అర్థాలుంటాయి. ఆ అర్థం స్పర్శించిన వారికీ, దానిని పొందిన వారికీ తెలుస్తుంది. రుక్మిణి నన్ను తాకటంలో అభినందన తప్ప మరొక అర్థమేమిలేదని నాకు తెలుసు. రుక్మిణికి తెలుసు. నీకు తెలియదు. అందుకే ఈ అసహనం."

అనసూయకు ఏమీ చేయలేని నిస్సహాయతతో దుఃఖం వచ్చింది. కేశవరావు గ్రహించి ఊరడించాడు.

ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడూ జరుగుతూనే ఉన్నా, వసుంధర విషయంలో అనసూయ తట్టుకోలేకపోయింది.

ఆ అతి చనువు. భుజాల మీద చేతులు వేసి మాట్లాడటం. ఒళ్ళో కూర్చున్నంత దగ్గరగా కూర్చోవటం. తాను ఎదురుగా ఉన్నప్పుడే ఇలా ఉంటే, ఇక తాను లేనప్పుడు వీళ్ళనెవరు అడ్డుకునేది.

ఇప్పుడు అనుమానం స్థిరమై, అసూయ అంకురించే దశకు వచ్చింది. ఆ దశకు వచ్చిన మనసు పరిస్థితి విచిత్రమైనది. ఆ అనుమానం నుంచి బైటికి రాబుద్ధి కాదు. పదే పదే ఆ విషయాన్ని మనసు మెలివేస్తూ ఒక దట్టమైన, గాఢమైన అనుభూతిలోకీ, అనుభవంలోకి పోతుంది. ఆ అనుభూతి, అనుభవం ఎంత హింస అనిపిస్తుందో, అంత హాయి కూడా అనిపిస్తుంది. దురద గోకిన కొద్దీ ఎక్కువై ఒక రకమైన రిలీఫ్‌నీ- ఆ పని చేయకుండా ఉండలేని స్థితికి తీసుకెళ్ళినట్లే, అనుమానం కూడా మనిషినొక స్థితికి చేరుస్తుంది. ఆ స్థితి నుంచి బైట పడాలనిపించదు. దానిని ఇంకా ఇంకా పెంచాలనిపిస్తుంది. దానిని అంతస్తు మీద అంతస్తు పేర్చినట్లు పేర్చి, పెరగనిస్తున్న కొద్దీ మనసులో ఉద్రేకం, కోపం, దుఃఖం, నిస్సహాయత, తనపై తనకే జాలి - ఇవన్నీ కలిపి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆ ఉద్రేకాల వెల్లువలోంచి బైటికి రావాలని అనిపించకపోవటంలోనే ఉంది తమాషా. ఇంకా ఇంకా ఆ వెల్లువలో తల మునకలై, ఈది ఈది, ఇక ఈదలేక తాను మునగటమో, ఎదుటివారిని ముంచటమో తప్ప మరో దారి లేనంత స్థాయికి వెళ్తుంది. ఆ ఉద్ధృతిని నిరోధించటం ఎవరివల్లా కాదు.

అట్లాంటి ప్రమాద స్థితిలోకి అనసూయ వెళ్ళిన క్షణాలలో దాని నుంచి నేర్పుగా తప్పించింది వసుంధరే.

"ఎందుకా వసుంధర మీ ఒళ్ళో వాలిపోతుంది?" ఒక రోజు అనసూయ కోపం పట్టలేక అడిగింది.

"మేం చాలా చిన్నప్పటి నుంచీ స్నేహితులం. స్కూలు రోజుల నుంచీ స్నేహం. చనువెక్కువ." కేశవరావుకి ఆ సంజాయిషీ ఇవ్వాల్సి రావటం బాధగా అనిపించింది.

"నాక్కూడా స్కూలు రోజుల నుంచీ మగ స్నేహితులున్నారు. నేనూ అలా వాలిపోనా? సహిస్తారా మీరు?"

కేశవరావుకి కోపం వచ్చింది.

"నా అనుమతి కోసమే ఇన్నాళ్ళూ ఆగావా?"

అనసూయకు దుఃఖం ముంచుకొచ్చి అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

ఆ రోజు సాయంత్రం వసుంధర వచ్చింది. అనసూయ వంటింట్లోంచి తనకూ, కేశవరావుకీ కాఫీ తీసుకుని హాల్లోకి వచ్చేసరికి వసుంధర కేశవరావు పక్కనే కూర్చుని అతని

భుజం మీద చేయివేసి ఏదో చెబుతోంది. అనసూయ వాళ్ళిద్దరికీ కాఫీ ఇచ్చి అక్కడే ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

"వసూ, నువ్వు వెళ్ళి అనసూయ పక్కన కూచో, నువ్విలా నా పక్కన కూచోటం, చనువుగా నా మీద చేతులెయ్యటం తనకు నచ్చటం లేదు."

వసుంధర ముఖం ఒక్కసారిగా పాలిపోయింది.

"అదేంటి" అంది.

"ఏంటేమిటి? ఆమె నా భార్య. ఆమెకు నా మీదా, నా శరీరం మీదా సర్వ హక్కులూ ఉన్నాయి. నా శరీరం మీద ఎవరు చేతులు వెయ్యాలి. ఎవరు వెయ్యకూడదు. ఎవరు నాతో ఎంత దూరంగా నుంచుని మాట్లాడాలి- అన్నీ తాను నిర్ణయిస్తుంది."

ఈసారి అనసూయ ముఖం రక్తహీనమయింది.

ఇద్దరాడవాళ్ళనూ ఇరుకునబెట్టి, అక్కడ నుంచి వెళ్ళిపోవాలని లేచాడు కేశవరావు.

వసుంధర చాలా తొందరగా కూడదీసుకుంది. హడావిడిగానే అయినా, అర్థవంతంగా మాట్లాడాలని ప్రయత్నించింది.

"ఆగు కేశూ. అనసూయ నీ భార్యగా వచ్చి ఆరు నెలలయిందా? ఆమెకు నీ జీవితం గురించీ, నీ స్నేహితుల గురించీ ఏం తెలుస్తుంది? ఆమె స్థానంలో నేనున్నా అలాగే అనుకునేదాన్ని. బైట ప్రపంచంలో అందరూ అట్లాగే ఉన్నారు. మనం అతి కొద్ది మందిమి ఆడా, మగా తేడాల్లేకుండా ఉంటున్నామని ప్రపంచమంతా మారిపోతుందా? అందరూ మనలాగే ఉండరు. ఈ విషయాలు అనసూయకు పెళ్ళికి ముందు చెప్పి పెళ్ళాడావా? 'నేనూ, నా ఆడ స్నేహితులూ, ఆడా మగాలా కాక ఇద్దరు మనుషుల్లా ఉంటాం. అది నీకు కష్టంగా ఉంటుందేమో ఆలోచించు' అని అడిగావా?

అందరు మగాళ్ళలానే నీకనుకూలంగా భార్యను మార్చుకోవచ్చు అనుకున్నావు. పెళ్ళయ్యాక ఆటోమేటిగ్గా తాను నిన్నర్థం చేసుకునేలా మారాలనుకున్నావు. అలా జరగలేదని ఆమెను నా ఎదుట అవమానిస్తావా? నీ మగ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. అనసూయకు నీ జీవితంలో ఏ ఏ విషయాల పట్ల అభ్యంతరమో కనుక్కుని వాటిలో నువ్వు మారు.

సారీ అనసూయా, నేను చాలా తెలివి తక్కువగా ఉన్నాను. ఈ పెద్ద మనిషితో నాకు పదేళ్ళ వయసు నుంచీ స్నేహం. బొమ్మలు వేసి తగలడతాడుగా, ఆ అభిమానం కొంతా- మొత్తానికి నీ ఫీలింగ్స్ పట్టించుకోకుండా బాధపెట్టాను."

వసుంధర తన చేతులు పట్టుకుని మనస్ఫూర్తిగా అంటున్న మాటలకు అనసూయ కరిగిపోయింది.

వసుంధర చేతుల్ని గుండెల దగ్గరకు తీసుకుని, "సారీ, నాకేమయిందో నాకే తెలియటం లేదు. మిమ్మల్ని బాధ పెట్టాను" అంటూ ఏడ్చేసింది.

అనసూయను కూర్చోబెట్టి, ఆమె ఏడుస్తున్నంత సేపూ వీపు నిమురుతూ పక్కనే కూర్చుంది వసుంధర. ఆ ఉద్ధృతి తగ్గాక మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. అనసూయ ముఖం దుఃఖంతో, సిగ్గుతో ఎర్రబడి తమాషాగా ఉంది.

"ఇప్పుడు నీ పోట్రెయిట్ వేయాలనిపిస్తోంది" అన్నాడు కేశవరావు వాతావరణాన్ని తేలిక చెయ్యాలని.

"ఔను. అనసూయ ఎంతందంగా ఉందో." వసుంధర ప్రేమగా అంది. అనసూయ ముడుచుకుపోయి కూర్చుంది.

ఆ తర్వాత వసుంధర చాలాసేపు మాట్లాడింది. తమ చిన్ననాటి సంగతులు, తమ స్నేహితుల గుంపు, వాళ్ళ ఆలోచనలు.

నేనూ, సుజాతా, ప్రమోద, హేమ- నలుగురమే అమ్మాయిలం. వీళ్ళ గుంపు అబ్బాయిలొక పదిమంది. మేమంతా కలిసి ఒక కట్ట. మా నలుగురికీ అమ్మాయిలతో కంటే వీళ్ళతోనే స్నేహం ఎక్కువ. మా ఆసక్తులు కూడా సాహిత్యం, రాజకీయాలు, కళలూ, నాటకాలు- ఇలా ఉండేవి. కాలేజీ అంతా మేమే అయి తిరిగేవాళ్ళం.

మా మీద విమర్శలు రాలేదనుకోకు. మేం లెక్క పెట్టలేదంతే. అప్పట్లో అన్నిటి మీదా తిరగబడాలని చేసేవాళ్ళం కొత్త కొత్త పనులు. ఆడపిల్లలు చెయ్యని పనులు. ఈ పదిమంది మగాళ్ళూ మాకు తోడు. కొన్నాళ్ళు వాళ్ళతో కలిసి సిగరెట్లు తాగాలని చూశాం. నాకూ, హేమకూ పడలేదు. మానేశాం. సుజాతకు బాగా అలవాటైంది.

సెకండ్ షో సినిమాలకు నేల క్లాసుకి వెళ్ళేవాళ్ళం. సినిమా హాల్లో కూడా రాజకీయాలు మాట్లాడటం. ఏదో తిరుగుబాటు. ఆడపిల్లల్లా ఇంట్లో ముడుచుకోవటం, ఎప్పుడూ ఇంటి కబుర్లు, బట్టలు, నగలు, సినిమా తారల కబుర్లు చెప్పుకోవటం మీద తిరుగుబాటు. చాలా భిన్నంగా బతకాలని తాపత్రయపడేవాళ్ళం. మా తాపత్రయాన్ని సరిగా అర్థం చేసుకుని స్నేహం చేశారు కేశూ, ఇంకా కొందరు..."

వసుంధర మాటల్ని, ఆమె జీవిత విధానాన్నీ అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ స్నేహభావం పెంచుకుంది అనసూయ. క్రమంగా కేశవరావుకి స్నేహితురాలైంది.

ఆ తర్వాత సంవత్సరం తానూ ఓ కాలేజీలో లెక్చరర్‌గా చేరింది. ఇద్దరు పిల్లలతో, ఉద్యోగంతో తానూ, తన ఉద్యోగంతో, చిత్రకళతో కేశవరావూ ఒక రొటీన్‌లో పడినా, జీవితాన్ని కాస్త భిన్నంగా గడపటానికి దొరికిన ఏ అవకాశాన్నీ వదలకుండా బతికారు.

అనసూయ తాను ఆడదాన్నని మర్చిపోయి ఒక మనిషిలా మగవాళ్లతో స్నేహం చేయటానికి ప్రయత్నించింది. అన్నిసార్లూ ఆ ప్రయత్నాలు సఫలం కాలేదు గానీ, నలుగురైదుగురు మంచి స్నేహితులు దొరికారు.

మొదటి స్నేహితుడు దొరికినప్పుడు కేశవరావులో వచ్చిన మార్పు అనసూయ ఎప్పుడూ మర్చిపోదు. కేశవరావు కళ్లల్లో మొదటిసారి అనుమానం, అసహనం, అయోమయం, బాధ అన్నీ కలగలిసిన చూపు చూసి ఆమెకు నవ్వు వచ్చింది. కలకత్తాలో ఉంటున్న వసుంధరను అర్జెంటుగా పిలిపించాలనిపించింది.

"ఆ రామారావు కొంచెం అతిగా ప్రవర్తిస్తాడల్లే ఉందే" అన్న మాటతో మొదలు పెట్టి చాలా మాటలే అన్నాడు.

"రామారావు వస్తే నీకు టైమే కాదు, ఒళ్ళు కూడా తెలియటం లేద"న్నాడు.

"మన ముగ్గురం సినిమాకా? చూసినవాళ్ళు అతనే నీ భర్తేమో అనుకుంటారు." ఇట్లా చాలా అన్నాడు.

తాను చిన్న చిన్న సమాధానాలిస్తూ అన్నిటినీ ఆనందించింది. కేశవరావు మనసు ఎట్లా పనిచేస్తుందో ఆమెకు అనుభవమే. తాను పొందిన అనుభవాన్ని భర్త పొందడం వినోదంగా చూసింది. మెల్లగా చురకలంటించింది. ఈ లోకంలోకి వచ్చాక కేశవరావు అన్నాడు.

"ఎందుకు ఇంత పొసెసివ్‌నెస్ ఈ వివాహంలో?"

"మనుషులకు మనుషుల మీద అధికారం, సొంతం అనే భావన ఈ సంబంధం కలిగించినట్లు ఇంకేదీ కలిగించదు. అట్లా కలిగించటానికనే ఏర్పరిచారనుకుంటా పెళ్ళి.'

"అంతకు ముందున్న పద్ధతి నుంచి మార్చటానికి పెట్టిన కట్టుబాట్లు ఇంకా కొనసాగటమే ఆశ్చర్యం" అన్నాడతను.

"ఆశ్చర్యమేముంది? అలవాటు- కండిషన్ అయిపోతాం."

"ఆడా, మగా మధ్య వట్టి స్నేహానికే ఇంత కంగారు దేనికొస్తుంది?" భార్యను తాను కంగారు పెట్టానని మర్చిపోయి అమాయకంగా అన్నాడు:

"స్నేహం ప్రేమగా మారే అవకాశం ఉంటుందిగా. ఆ భయం" అంది ఆమె జ్ఞానిలా. ఇద్దరి పాత్రలూ మారటం అనసూయకెంత సంతోషమో!

"ఒక మనిషి ఎంత మందిని ప్రేమించగలుగు తాడంటావ్?"

"మనిషంటే మగాడేనా ఏంటి?"

"పోనీ, ఒక మనిషి ఎంత మందిని ప్రేమించగలుగుతుంది?"

"చలంగారి నడుగుదామా?" అతన్ని వినోదంగా చూసి నవ్వేది.

"నువ్వింకొకళ్ళతో నాతో ఉన్నట్టు ఉండటం నేను సహించలేనేమో!"

"నేనూ సహించలేనేమో!"

ఇద్దరూ నవ్వుకునేవారు.

"ఎప్పుడైనా ఇంకొకరి మీద అట్లాంటి ప్రేమ కలిగితే నీకు? ఏం చేస్తావు?" అనసూయ కళ్ళల్లోకి చూస్తూ అడిగేవాడు కేశవరావు.

"ముందు నీకు చెబుతా. ఇద్దరం కలిసి ఆలోచిద్దాం ఏం చేయాలో" అంటే-

"అమ్మో, నాకు చెప్పొద్దు. నేను భరించలేను. ఆ బాధేదో నువ్వే పడు..."

"కానీ, కేశూ నీలా ఇంకొకర్ని ప్రేమించలేనేమో" అంటే, కరిగిపోతూనే, "ఏంటి దిగులుగా ఉందా" అని కోపం తెచ్చుకునేవాడు.

"కాదా మరి, నాకు ప్రేమించాలని ఉంది. నీతో పెళ్ళయ్యేప్పుడు నీ మీద ప్రేమ లేదు నాకు. నిన్ను ప్రేమించాలి అని మనసుకి ట్రైనింగ్ ఇచ్చుకున్నాను. తర్వాత ఎప్పుడో సంవత్సరం దాటాక నిన్ను ప్రేమించడం మొదలు పెట్టాను."

"ఎప్పుడు? ఎందుకు? ప్లీజ్, చెప్పవా?" బతిమాలేవాడు.

"ప్రేమించటం మొదలుపెట్టడం కాదేమో, ప్రేమను గుర్తుపట్టడం."

"సరే, అదే చెప్పు."

"చెప్తాలే కానీ, పెళ్ళితో సంబంధం లేకుండా ప్రేమించాలనీ ఉంది."

"సరే, ప్రేమించు. కానీ, నాతో చెప్పొద్దు." అలిగి దూరం జరిగేవాడు.

"సర్లే చెప్పన్లే" అంటే-

"అమ్మో, చెప్పవా" అంటూ దగ్గరగా జరిగి గట్టిగా కావలించుకునేవాడు. ఇద్దరూ నవ్వుకునేవారు. ఇద్దరికీ తెలిసినట్లుగానే ఉండేది ఈ సంబంధం బలమైనదని.

అప్పుడప్పుడూ అనసూయ అనేది.

"నాకు ఈ ప్రపంచంలో ఇంకో మగాడు లేకపోతే ఎట్లా?"

"అదేంటి?" అతనికి ఆశ్చర్యం.

"ఔను. నువ్వు తప్ప మిగిలినవాళ్ళెవరూ నాకు మగాళ్ళలా కనపడరు. అంటే

మగాళ్ళను చూస్తే ఏదోగా ఉండటం, ఒక క్యూరియాసిటీ, అందంగా, ఆకర్షణగా ఉన్నవాళ్ళను చూస్తే కాస్త కలవరంగా ఉండటం-ఇట్లాంటి మార్పులు సహజంగా శరీరంలో జరగాలనుకుంటా. పెళ్ళికి ముందు జరిగేవి. పెళ్ళయ్యాక ఒక సంవత్సరం బాగానే ఉన్నా- నిన్ను ప్రేమించాక ఇప్పుడెవరిని చూసినా ఏం లేదు- అంతా ఒకటే. నువ్వొక్కడివే వేరు. వాళ్ళు మగవాళ్ళు, నేను ఆడదాన్ననే ఫీలింగ్ రావటం లేదు."

"పాపం. చాలా పెద్ద కష్టం వచ్చిందే. నన్ను మాత్రం ఆడవాళ్ళు ఆకర్షిస్తూనే ఉన్నారు.'

అనసూయ ఉడుక్కుంటుంటే ఇంకాస్త వర్ణించి చెప్పేవాడు.

ఇలాంటి సంభాషణల వల్లా, ప్రేమ గురించీ, స్నేహం గురించీ, మానవ సంబంధాల గురించీ లోతుగా మాట్లాడుకోవటం వల్లా తమ మధ్య ప్రేమ బలపడుతోందని తమకప్పుడు తెలుసా?

ఆ రోజులన్నీ గుర్తొచ్చాయి అనసూయకు.

చరిత్ర పునరావృతమవుతోంది. ఒక జీవిత కాలంలోనే !

పాత జ్ఞాపకాలు ఇచ్చిన ఆనందం, కొడుకు ఇచ్చిన బాధా కలగలిసి చిత్రమైన అనుభూతి మనసులో.

తొమ్మిది అవకుండానే వచ్చాడు కేశవరావు. ముగ్గురూ భోజనం చేశారు. తాను చెప్పే ఏ విషయానికీ తల్లీకొడుకులు స్పందించకపోవటంతో ఏదో జరిగిందని గ్రహించాడు.

భోజనాలయ్యాక అనసూయ చెప్పింది విని-

"ఉండు. వాడికో క్లాసు పీకొస్తా. దరిద్రపు ఆలోచనలూ వీడూనూ. మనమ్మాయికి ఫోన్ చేస్తే వచ్చి అది కుదురుస్తుంది వీడి తిక్క. అసలు వీడు చిన్నప్పట్నించీ ఇంతే. ఒక్క గర్ల్ ఫ్రెండ్ ఉండేది కాదు." కొడుకు మీద కోపం పట్టలేకపోతున్నాడు.

"అందుకే శుభ్రంగా పెళ్ళి చేసుకున్నాడు. మీ కూతురికి ఉన్నదంతా బాయ్ ఫ్రెండ్సే. ఒక్కడూ పెళ్ళికి పనికిరాడు."

"ఇప్పుడు దాని పెళ్ళికేం తొందర? అసలది పెళ్ళి చేసుకోదు. నీకేంటి కష్టం?"

"నాకొక్కదానికేనా కష్టం? పాతికేళ్ళు దాటాయి. ఎవరిని ఎంచుకున్నా మనం ఏమీ అనం."

"దానికి నచ్చినవాడు దొరకొద్దూ."

అసలు సమస్య వదిలి ఇద్దరూ ఇంకో దారి పట్టారని ఇద్దరికీ తెలిసింది.

"సరే. మనం ఇప్పుడేం చెయ్యాలి? ఇట్లా పెళ్ళి చేసుకుని పెళ్ళాన్ని కాల్చుకుతినటం

కంటే అసలు పెళ్ళి చేసుకోకపోవటం నయం."

కొడుక్కంటే కూతురే గొప్పని నిరూపించాలనే తాపత్రయం నుంచి ఆయన బైటపడలేదు.

"ఆ పిల్ల లక్షణమైన ఉద్యోగం మానెయ్యాలా? నేను రేపొద్దున్నే చెబుతా. వీడి ముఖాన విడాకులు పారేసి హాయిగా ఉద్యోగం చేసుకోమ్మా అని." అనసూయకు కోపం వచ్చిందని గ్రహించినా అతని కోపం ఆగటం లేదు.

"సరే. ఏం చెయ్యాలో చెప్పు. నాకైతే చిన్నప్పటి నుంచీ వీడిని తన్నకుండా నిగ్రహించుకున్నానే- వాటన్నిటినీ ఇప్పుడు తందామనిపిస్తోంది."

"ఒకప్పుడు మనం ఇలాగే బాధపడ్డాం. మర్చిపోయావా?"

"ఆ రోజులు వేరు. ఇప్పుడెంత స్వేచ్ఛగా తిరుగుతున్నారు అమ్మాయిలూ, అబ్బాయిలూ."

అనసూయ మనసులోనూ అదే ఆలోచనలు.

కొత్త తరానికి కొత్త సమస్యలు తప్పవు. అందులో ఆడవాళ్ళకు. ఇప్పటి పిల్లలు తాము మగవాళ్ళతో సమానం అన్న భావనతో పెరుగుతున్నారు. బైట సమాజం పూర్తిగా మారకపోయినా, వీళ్ళు దాని మీద పోట్లాడి జయించాలనే స్పిరిట్‌తో పెరుగుతున్నారు. ఇన్నాళ్ళూ తమ జాతి కోల్పోయిన జీవితానందాలను తాము పొందాలనీ, పొందగలమనీ నిర్ణయంతో, ఆశతో, ఉత్సాహంతో జీవితంలోకి వెళ్తున్నారు. కొత్త ప్రదేశాలు, కొత్త మనుషులు వీటి దగ్గరకు వెళ్ళి కూడా గదిలో తలుపులు మూసుకు కూర్చుంటే వాళ్ళ మనసు ఎట్లా పెరుగుతుంది? వాళ్ళు చెయ్యాల్సిన కొత్త పనులకు కావలసిన ఉత్సాహం, తెలివి, సాహసం ఎట్లా వస్తాయి? అనుభవాల నుంచి నేర్చుకునే అవకాశాలు కూడా లేకపోతే వాళ్ళు ఎట్లా ఎదుగుతారు? జీవితం ఎప్పుడూ వికసించాల్సిందే. ఎన్ని బాధలు రానీ, ఒకోసారి పూలనుకున్నవి ముళ్ళై చీరుకుపోనీ, వికాసం ఇచ్చే ఆనందం మరింకేది ఇవ్వదు.

ఆ వికాసాన్ని పొందవద్దని కొడుకు అనటం చాలా అన్యాయం.

"కొత్త తరానికి కొత్త సమస్యలు" అంది భారంగా.

"మనుషులు తాళ్ళలా పెరిగి, మనసులు పెరగకపోతే వస్తాయి- నీ కొడుకు సంగతి అదే!"

"అలాగే అనుకో. వాడి మనసు పెరగటానికి ఇదొక అవకాశం. ఆ అనుభవంతో నన్నా వాడు విశాలంగా ఆలోచిస్తాడేమో."

వాళ్ళిలా వాదులాడుకుంటూనే ఉన్నారు.

అచల పువ్వులా వచ్చింది. అనసూయ తన అలజడి పైకి కనిపించనీయకుండా పలకరించింది.

"ఎలా జరిగిందమ్మా ప్రయాణం?"

"చాలా బాగుందత్తయ్యా. ఈ సారి మీరు ఢిల్లీ వెళ్తే ఆనందగాంవ్‌లో నాలుగు రోజులు ఉండండి. ఎంత ఆర్టిస్టిక్‌గా ఉందో. ఇంకా చలి వదల్లేదు ఢిల్లీని. ఆ చలి, వేడెక్కే చర్చలు, సాయంత్రం వాకింగ్ చేస్తూ రిలాక్సయేవాళ్లం. అక్కడ ఎన్ని నెమళ్ళున్నాయో. ఒక నెమలి నేను చూస్తుండగా ఈ ఈక రాల్చి పారిపోయింది. ఎంత బాగుందో చూడండి." పెద్ద నెమలి ఈకను బ్యాగ్‌లోంచి జాగ్రత్తగా తీసి అనసూయకిచ్చింది.

అనసూయ దానిని అపురూపంగా అందుకుంది.

ఈ మాటలకు అరవింద్ గదిలోంచి బైటికి రాలేదు. అచల గదిలోకి వెళ్ళి చూసి నిద్రపోతున్నాడంటూ వచ్చింది.

"నువ్వా పడుకోమ్మా. విమానంలో సరైన తిండి దొరికిందా? అన్నం ఉంది తినేస్తావా?'

"శుభ్రంగా తిన్నానత్తయ్యా. ఆకల్లేదు" అంటూ వెళ్ళింది అచల.

అనసూయ తలుపులన్నీ వేసి, లైట్లు తీసి కొడుకు గదిలో రేగే కల్లోలాన్ని ఊహించుకుంటూ, భయపడుతూ పడుకుంది. కేశవరావు మనసులోనూ ఆ ఊహలే.

మర్నాడు జరగబోయే విషయాలు తల్చుకోవటానికే భయంగా ఉంది ఇద్దరికీ.

* * *

ఉదయం వంటలో అనసూయకు సహాయం చెయ్యటానికి వచ్చింది అచల. ఇద్దరూ ఒకరినొకరు పరిశీలనగా చూసుకున్నారు. నిద్రలేమితో ఇద్దరి కళ్ళూ ఎర్రగానే ఉన్నాయి.

"నువ్వు స్నానం చేసి రారాదూ? పెద్ద పనేంలేదు. ఆఫీసుకి ఎన్ని గంటలకు వెళ్ళాలి?' అనసూయ ఏదో మాట్లాడేస్తోంది.

"ఇవాళ ఆఫీసుకి వెళ్ళనత్తయ్యా. మీతో మాట్లాడాలి."

అనసూయ గుండె వేగంగా కొట్టుకుంది. రాత్రి గొడవపడి ఉంటారు. అచల ఏమంటుంది? ఏం జరగబోతోంది. వంకాయలు తరగటం ఆపి ఆలోచనలో పడింది.

"కంగారేం లేదులే అత్తయ్యా. మీరనవసరంగా ఆలోచించి మనసు పాడు చేసుకోకండి" అంటూ తాలింపుకి అన్నీ సిద్ధం చేసింది. చకచకా వంటింటి పని నడిచింది.

అరవింద్ అన్నం తిని బ్యాంక్‌కి వెళ్ళిపోయాడు. కేశవరావు పేపర్లు చూడటం పన్నెండింటికి కానీ పూర్తి కాదు. రేట్లు తగ్గినప్పటి నుంచీ అన్ని పేపర్లూ తెప్పిస్తున్నాడు.

అత్తాకోడళ్ళు స్నానాలు చేసి హాల్లోకి వచ్చారు.

రాత్రంతా కొడుకు మీద కత్తులు నూరిన కేశవరావుకి అచలను చూస్తే సిగ్గుగా అనిపించింది. కొడుకు ప్రవర్తన గురించి ఇప్పుడీ అమ్మాయి చెబితే ఏం చెయ్యాలి? ఏం చెప్పాలి అని ఒక క్షణం అయోమయంలో పడ్డాడు. ముగ్గురూ పది నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చున్నారు. అచలను చూస్తుంటే కడుపులోంచి వస్తున్న దుఃఖాన్ని గొంతులోనే మింగేస్తూ అంది అనసూయ, "చెప్పమ్మా - ఏం చేద్దాం?"

వాళ్ళిద్దరూ కొంత మాట్లాడుకున్నారని అర్థమైంది కేశవరావుకు.

"అసలు నువ్వు ఆ సంగతులన్నీ వాడికెందుకు చెప్పావమ్మా" అన్నాడు అసందర్భంగా.

"అదేంటి మావయ్యా, నేను బాగా సంతోషంగా ఉన్న సందర్భాలను అతనితో పంచుకోకపోతే ఇక మా సంబంధానికి అర్థమేముంది? అది రహస్యంగా దాచాల్సిన అవసరమేముంది? అలా దాయటం అసహ్యం నా దృష్టిలో."

అచల గొంతులో అభిమానం ధ్వనించింది. కేశవరావు తన మాటను వెంటనే దిద్దుకున్నాడు.

"నిజమేనమ్మా. నేను దీన్ని తట్టుకోలేక అన్నాను. నువ్వు చేసింది కరెక్టే. నీ విషయంలో మాకేం కంప్లయింట్లు లేవు."

"అసలు ఈ విషయం మేమిద్దరం తేల్చుకోవాలి. అరవింద్ అనవసరంగా మిమ్మల్ని ఇందులోకి లాగాడు."

అనసూయ కల్పించుకుని అన్నది, "దాన్ని గురించి నువ్వు బాధపడకమ్మా. మా పెళ్ళయిన కొత్తలో ఇలాంటి సమస్య మాకూ వచ్చింది. అప్పుడు చెప్పు కోవటానికి దగ్గర పెద్దవాళ్ళు ఊళ్ళల్లో ఉన్నారు. మేం కొత్తగా సిటీకి వచ్చాం. ఒకవేళ చెప్పినా వాళ్ళ నుంచి మాకెలాంటి సహాయం దొరికేదో తెలియదు. సాంప్రదాయికంగా ఆలోచించి ఆయన్ని చివాట్లే సేవారేమో. మా మధ్య దూరం పెరిగేదేమో. మా అమ్మా, నాన్నా అయితే నన్ను తీసుకెళ్ళిపోయే వారేమో. వాళ్ళంత ఛాందసులు. ఇప్పుడు మీకూ, మాకూ కూడా సిటీ జీవితం. కలిసే ఉంటున్నాం. సిటీల్లో మళ్ళీ చిన్న చిన్న ఉమ్మడి కుటుంబాలు తయారవుతున్నాయి. వీటిని వీలైనంత డెమొక్రాటిక్‌గా ఉంచుకోవాలి. మేం అరవింద్ మా అబ్బాయనీ, నువ్వు వేరనీ అనుకోం. వాడి మీద మా ఇద్దరికీ నీ కంటే ఎక్కువ కోపంగా ఉంది. అయితే, అవమానం పడింది నువ్వు. నిర్ణయం తీసుకోవాల్సింది నువ్వు."

అనసూయ ఉద్రేకపడకుండా అంత వివరంగా మాట్లాడినందుకు కేశవరావు

ఆశ్చర్యపడ్డాడు.

"మీ సమస్య ఏంటత్తయ్యా?" ఆసక్తిగా అడిగింది అచల.

భార్యాభర్తలిద్దరూ తమ మధ్య వచ్చిపోయిన కలతల గురించి చెప్పారు.

"ఆ రోజు వసుంధర లేకపోతే నేను ఈయన్ని వదిలేసి వెళ్ళేదాన్నేమో. అప్పుడు మారవలసింది నేనని తెలిసింది. మారాను. మారినందుకు జీవితం మరింత విశాలమైంది. ఈ అనుభవం వల్ల అరవింద్ కూడా మారే అవకాశం ఇస్తే..." అనసూయ అచల వంక చూసింది.

"అవకాశం ఇవ్వటం ఏమిటత్తయ్యా. అతన్నెలా మార్చటమనేది ప్రశ్న. నేను ఆరు నెలల నుంచీ ఎంతో ప్రయత్నించాను. ఫలితం లేదు. మీరు ప్రయత్నిస్తానంటే నాకేం అభ్యంతరం లేదు. కానీ, రాత్రి అతను స్పష్టంగా చెప్పాడు- ఉద్యోగమో, తానో తేల్చుకోమని. ఆ మాట అన్న తర్వాత ఇక నేను ఇక్కడుండటం మర్యాద కాదు. ఇంకో ఇల్లు దొరికే వరకూ మా ఫ్రెండ్ దగ్గరికి వెళ్తాను. కొంత కాలం అతను మారతాడేమో చూద్దాం. మీరూ ప్రయత్నించండి. అతను మారితే అప్పుడు చూద్దాం."

అచల ఎంత ఆపినా కన్నీళ్ళు రానే వచ్చాయి.

అచల ఇల్లు వదిలి వెళ్తుందనే ఊహే భరించలేకపోయాడు కేశవరావు.

రెండేళ్ళ నుంచీ ఈ అమ్మాయి ఆ ఇద్దరికీ చిన్న చిన్న ఆనందాల నెన్నింటిని ఇచ్చిందో. వాటి తాలూకు బలంతో అన్నాడు.

"నువ్వెందుకు వెళ్ళాలమ్మా?"

"ఇది మీ ఇల్లు. అతను మీ అబ్బాయి." కన్నీళ్ళలోంచి నవ్వింది నీరసంగా.

"అయితే, ఇది మా ఇల్లు, నువ్వెళ్తున్నావు. వాడూ వెళ్ళాల్సిందే."

అచల ఆశ్చర్యపోయింది.

"మీరింత లిబరల్‌గా ఉంటారు. అతనెందుకలా తయారయ్యాడు."

"అది మాకూ అర్థం కాదమ్మా. బహుశా, బైటి ప్రభావాలే బలంగా పడ్డాయేమో."

"నువ్వు వెళ్ళిపోతే మేమూ ఉండలేం ఇక్కడ. కొన్ని రోజులు ఆమని దగ్గరకు వెళ్తాం. వాడి సమస్యవాడినే పరిష్కరించుకోనీ." అనసూయ అచల చేతిని గట్టిగా పట్టుకుంది.

అచల ఆశ్చర్యపోయింది.

"అన్నీ వివరంగా మాట్లాడతాం. మంచీ చెడ్డా చెప్పి చూస్తాం. వాడు ఆలోచించుకుని దోవలోకి వస్తే సరి. లేదంటే ఇక వాడి జీవితం వాడిది. మా జీవితం మాది." నిశ్చయంగా

అంది అనసూయ.

"అదేంటి. నా మూలంగా మీకెందుకీ కష్టం." అచలకూ వాళ్ళిద్దర్నీ వదలి వెళ్ళటం కష్టంగా ఉంది.

"నువ్వెవరమ్మా- మా అమ్మాయివి కాదా? వాడిని దాటి మన మధ్య ఏ సంబంధమూ లేదా? ఈ రెండేళ్ళూ మనం ఈ ఇంట్లో కలిసి బతకలేదా? వాడితో ముప్పై ఏళ్ళు గడిపాం. కానీ, ఇవాళ వాడు చేసిన పనితో వాడికీ, మాకూ ఏ సంబంధమైనా ఉందా అనిపిస్తుంది. కొడుకైనంతమాత్రాన మా ఆస్తులు గెలుచుకోగలడేమో గానీ, మనసులు గెలుచుకోలేడుగా. నీ పట్ల అతని ప్రవర్తన అన్యాయంగా ఉందనీ, మాకు నచ్చలేదనీ గట్టిగా, వాడికర్థమయ్యే భాషలో చెప్పాలి." కేశవరావు కళ్ళలో నీళ్ళూ, కోపం కలగలసి ఉన్నాయి.

అచల ఆ ఇంటి నుంచి వెళ్ళటానికి లేచింది.

"పదమ్మా, మీ ఫ్రెండ్ ఇంట్లో దింపి వస్తాం. కారు తియ్యి కేశూ" అంది అనసూయ.

అరవింద్ మారితే బాగుండుననే ఆశ, మారడేమోననే దిగులూ కలగలిసిన మనసులతో ముగ్గురూ ఆ ఇంట్లోంచి బైటికి నడిచారు.

*(ఇండియాటుడే, 26 జూన్ - 3 జూలై 2001)*